క్లుప్తంగా

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి సమీపంలో సిరిపురం ప్రసాద్, వెంకటదుర్గ దంపతులు నివాసం ఉంటారు. వీరికి 5 ఏళ్ల కిందట వివాహం కాగా ఒక పాప ఉంది. ప్రసాద్ మార్బుల్ పని చేస్తుండగా, వెంకట దుర్గ గతంలో ఈవెంట్‌లో పని చేసేది. వెంకట దుర్గకు గతంలో సాయి అనే వ్యక్తితో పరిచయం ఉంది. సాయితో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతూ ఉండేది. ఆ తర్వాత ప్రసాద్ అంటే ఇష్టం లేదని, తాను వెళ్లిపోవాలని అనుకుంటున్నానని అంటూ ఉండేది. మంగళవారం ఉదయం ప్రసాద్ పనికి వెళ్లగా, వెంకట దుర్గ తన అన్నయ్య ఫోన్‌కు వెళ్లిపోతున్నానని మెజేస్ చేసింది. దీంతో ఆందోళన చెందిన ప్రసాద్ వెంటనే ఇంటికి వచ్చి చూడగా, భార్య కనిపించలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అతిసార రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ):నగరంలో అతిసార వ్యాధి సోకి అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో బాధపడుతున్న రోగుల ఆరోగ్యంపై ప్రభుత్వం, సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎంసీపీఐ పార్టీ నగర కార్యదర్శి కాసాని గణేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వించిపేట ఎంసీపీఐ కార్యాలయంలో నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న గణేష్‌బాబు మాట్లాడుతూ విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో నీరు కలుషితమై ప్రభుత్వ ఆసుపత్రిలో అతిసార వ్యాధికి గురై చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిరంతరం వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ నాయకులు కంకిపాటి అనిల్ కుమార్, సుజాత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉపాధ్యాయుల ధర్నా



తిరువూరు: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా 2003 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులు తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం ఓపీఎస్ విధానం కిందకు తేవాలని కోరుతూ తహసీల్దారు ఉదయభాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించగా, ఏపీలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోని ప్రభుత్వం ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షిస్తోందని పలువురు పేర్కొన్నారు.

గొట్టుముక్కలలో విషజ్వరాలపై ఆర్డీఓ ఆరా

గొట్టుముక్కల(కంచికచర్ల): అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు చేపట్టాలని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఆదేశించారు. రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి గురువారం ఆయన మండలంలోని గొట్టుముక్కలలో పర్యటించారు. విషజ్వరాలు ఉన్నాయా అంటూ గ్రామస్తులను ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ విషజ్వరాల బారిన పడినట్లయితే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించాలని దోమలు వ్యాప్తి చెందకుండా నివారణకు ఎబేట్‌ను పిచకారీ చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి విషజ్వరాల బారిన పడిన రోగులను గుర్తించి వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో సరఫరా అయ్యే తాగునీరు ఎటువంటి కలుషితం లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఆనందకుమారి, తహసీల్దార్ నరసింహారావు, ఆర్ఐ వెంకటరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్

చందర్లపాడు(నందిగామరూరల్):భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు ఈనెల 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తోట రామారావుతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలకు పైగా కార్మికులు నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతుండగా 18 లక్షల మంది బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, కూటమి నేతలు 15 నెలలుగా ఆ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హామీలు విస్మరించిన సీఎం చంద్రబాబు

ఆటో మోటారు కార్మిక సంఘాల ఐక్య వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న దాది శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాసెంట్రల్): ఆటో మోటార్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు పూర్తిగా విస్మరించారని ఆటో మోటారు కార్మిక సంఘాల ఐక్యవేదిక విమర్శించింది. అనంతపురం సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో నిర్వహించిన సభలో ఆటో కార్మికులందరికి దసరా పండుగ రోజున వాహన మిత్ర రూ.15 వేలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారని, కానీ స్త్రీ శక్తి పథకంతో ఆదాయం కోల్పోయిన ఆటో, టాటా మేజిక్ వంటి డ్రైవర్లకు వాహన మిత్ర సహాయం పెంచాలన్న కార్మిక సంఘాల అభ్యర్థనను పట్టించుకోలేదని ఐక్యవేదిక మండిపడింది. ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశం ఆటో మోటార్ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు ముజఫర్ అహ్మద్, ఇఫ్టూ నాయకుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కార్మికులకు ఐదు ప్రధాన హామీలిచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత వాటిలో ఒకదానిని మాత్రమే అమలు చేస్తానని ప్రకటించి, మిగిలిన వాటిని విస్మరించడం చంద్రబాబు మోసానికి నిదర్శమన్నారు. ఆగస్టు 15న ఆటో మోటార్ కార్మికుల సంఘాలతో చర్చించడానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశామని ప్రకటించారని, ఆ కమిటీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలైన జీఓ 21 రద్దు, ఆటో మోటార్ కార్మికులకు సాధికారిత బోర్డు, ఇంధన ధరల తగ్గింపు వంటి హామీలపై అనంతపురం సభలో ప్రస్తావించక పోవడంలోనే మోసం దాగి ఉందన్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం వాహనాల నుంచి లేబర్ సెస్సు వసూలు చేస్తున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం, ఆ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఈ నెల 18వ తేదీన అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా విజయవాడలో ఆటో మోటార్ కార్మికులతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణ, ఈశ్వర్, ఏపీ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారి, ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకుడు దుర్గారావు, ఏపీ ప్రోగ్రెసివ్ మోటార్ అండ్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.ఈశ్వర్, ఆటో కార్మిక సంఘాల నాయకులు రవీంద్ర, సీహెచ్ పెద్దిరాజు, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ అభ్యర్థులు, డీవైఎఫ్ఐ కార్యకర్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 13 ప్రకారం 2,260 పోస్టులకు సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఈ ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 86 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేసి వారి శక్తి, సామర్థ్యాలను సమాజం కోసం వినియోగించుకోవాలని కోరారు. ప్రతి నోటిఫికేషన్ నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని ఉండాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జూలై 15, 2025 లోపు స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ, డీఈడీ చేసిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర నాయకులు బసవ, కృష్ణ, మహేష్ అభ్యర్థులు బాబు, మధు, లోకేష్, దివ్య, రమ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పనిచేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీజీబీ బీఎంఎస్ నాయకులు ఆ బ్యాంకు చైర్మన్ కె ప్రమోద్‌కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రఘునాథరెడ్డిలను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు సంఘ నాయకులు జి.వెంగళరెడ్డి, డీవీఎస్ రావు గురువారం వారిని కలిసి సమస్యల గురించి వివరించారు. వాటి విషయంలో చైర్మన్ సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాగా చైర్మన్, జీఎంలను కలిసిన వారిలో సంఘ నాయకులు ఎం.అంకయ్య, బాషా, ప్రసాదరావు, ఎం.బజారి ఉన్నారు.

వెదుళ్లవాగుకు వరద ఉధృతి



తిరువూరురూరల్: మండలంలోని చౌటపల్లి–జీకొత్తూరు గ్రామాల నడుమ వెదుళ్లవాగుకు గురువారం మళ్లీ వరద రావడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షంతో వాగు చప్టాపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. తిరువూరు మండలంలో 7.86 సెంటీ మీటర్లు, గంపలగూడెం మండలంలో 10.94 సెంటీమీటర్లు, విస్సన్నపేట మండలంలో 9.12 సెం.మీ., ఎ.కొండూరులో 2.14 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు):సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జోన్–26 అధ్యక్షుడు జేసీ భరత్ కుమార్ అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ జేసీఐ 110వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. జేసీఐ–26 జోన్ డైరెక్టర్ లక్కం రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలని చెప్పారు. జేసీఐ విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు కందుల రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ గాయత్రీనగర్‌లోని పాపులర్ స్పోర్ట్స్ సెంటర్‌లో షటిల్ టోర్నమెంట్, టీజీఐఎఫ్ఎఫ్ క్రీడా మైదానంలో థగ్ ఆఫ్ వార్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ సహకారంతో యోగాసనాల సాధన, కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు మునిసిపల్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు, మంగళగిరి మండలం పెదపాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని వివరించారు. జేసీఐ వీక్ చైర్మన్ విజయ్ కొల్లేటి, కో–ఆర్డినేటర్ సీఎంవీవీ.సారయ్య, సభ్యులు శివ జంపాల, గణేశ్ బాబు, చీపిల్ల అశోక్ బాబు, భవాని కృష్ణ, కాశీ, రాములు, రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సర్జరీ నైపుణ్యాలు పెంచుకోవాలి

డీఎంఈ డాక్టర్ రఘునందనరావు



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న డీఎంఈ రఘునందనరావు, ఏడుకొండలరావు, ఏవీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు):పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు సర్జరీ నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రఘునందనరావు అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్యూచర్ నాటింగ్ హ్యాండ్స్–ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ రఘునందనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు శస్త్ర చికిత్స నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈ వర్క్‌షాపు దోహదం చేస్తుందని తెలిపారు. స్యూచర్ టెక్నిక్‌లు, విధి నిర్వహణ పద్ధతి, రోగులతో అనుసంధానం, నిబద్ధత వంటి అంశాలపై విలువైన సూచనలు ఇచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యవంతమైన సర్జన్‌లుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ దుర్గారాణి, డాక్టర్ బీఎస్‌పీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో దాదాపు 40 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

14న పవర్ లిఫ్టింగ్ పోటీలు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న తిరువూరులో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. స్థానిక బైపాస్‌రోడ్డు సెంటర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో నాగుబండి రామారావు స్మారక సంస్థ సహకారంతో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఓపెన్, మాస్టర్స్ బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99854 22567 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఇదేం భక్తి ఎమ్మెల్యే సారూ !

విద్యాధరపురం సితార జంక్షన్‌లో వాటర్ ఫౌంటెన్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనాచౌదరి బూట్లు ధరించి దేవుడి పటానికి కొబ్బరికాయ కొడుతున్న చిత్రమిది.
భవానీపురం(విజయవాడపశ్చిమ)

కూటమి నిర్లక్ష్యమే డయేరియాకు కారణం

జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ):కూటమి ప్రభుత్వ అంతులేని నిర్లక్ష్యమే కొత్త రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మెన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత కొన్ని రోజులుగా ఆర్‌ఆర్‌పేట తదితర పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలి ప్రజలు అస్వస్థతతో ఆసుపత్రుల పాలవుతుంటే కనీస ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. వందలాది మంది అస్వస్థతతో ఆసుపత్రుల పాలవుతుంటే తూతూ మంత్రంగా ఒక వైద్య శిబిరం నిర్వహించి అధికారులు చేతులు దులుపుకొనే పరిస్థితి ఇక్కడ నెలకుండటం దారుణమని ఆరోపించారు. విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రికి రోగులు గంట గంటకు పెరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్లాపు సినిమాకు బలవంతపు విజయోత్సవ వేడుకల్లో మునిగితేలుతూ ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. మంత్రి తక్షణమే న్యూ ఆర్ ఆర్‌పేటలో డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పర్యటించి వ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతిభకు పదును పెట్టాలి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):అమరావతి క్వాంటంవాలీ హ్యాక్‌థాన్ – 2025 పోటీల్లో పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి బహుమతులను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఇటీవల ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటంవాలీ హ్యాక్‌థాన్ – 2025 పేరుతో సాంకేతిక పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. తమ విద్యార్థులు రెండు బృందాలుగా సెమీ ఫైనల్స్‌లో విజయం సాధించారని చెప్పారు. ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించి పదివేలు, ఐదు వేలు చొప్పున నగదు బహుమతులను సైతం కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ఫైనల్స్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో కార్యదర్శి చిట్టా అమరుసుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్యలు విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ డి.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ సంధ్యారాణికి పరామర్శ



సంధ్యారాణిని పరామర్శిస్తున్న శ్రీశైలజ రెడ్డి, పుణ్యశీల, బీజాన్‌బీ

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఏపీ సంగీత, సాహిత్య అకాడమీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 43వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బట్టిపాటి సంధ్యారాణిని పార్టీ మహిళా నాయకులు పరామర్శించారు. డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు బట్టిపాటి శివ యాదవ్ ఇటీవల ఆకస్మికంగా మరణించిన నేపథ్యంలో గురువారం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల, మాజీ కార్పొరేటర్ షేక్ బీజాన్‌బీ ఊర్మిళా నగర్‌లోని సంధ్యారాణి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మీతోపాటు కష్టపడి పనిచేసి డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించటంలో మంచి పేరు తెచ్చుకున్న బట్టిపాటి శివ చిన్న వయసులోనే అకాల మరణం చెందటం దురదృష్టకరమని వారు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇద్దరు పిల్లలు చేతికి అందివచ్చిన సమయంలో శివ లేక పోవడం బాధాకరమని అన్నారు. కుటుంబానికి ఏ అవసరం, కష్టం వచ్చినా తామంతా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని చెప్పి సంధ్యారాణి, ఆమె పిల్లలు మానస్, స్నేహలను ఓదార్చారు.

ల్యాబ్ రిపోర్టులు పరిశీలించాలి



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


పటమట(విజయవాడ తూర్పు):నగరంలోని ఆర్వో ప్లాంట్లలో నీటి శుద్ధత ల్యాబ్ రిపోర్టులు పరిశీలించి వారికి ట్రేడ్ లైసెన్స్, వాటర్ టెస్టింగ్ తాజా ల్యాబ్ రిపోర్ట్ లేకపోయినా వెంటనే సీజ్ చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శాఖాధిపతులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బందితో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తమ పరిధిలో గల ఆర్ఓ ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా వ్యాపారం చేస్తున్న వారిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, నీటి పరీక్షల ల్యాబ్ రిపోర్ట్ లేకపోతే వెంటనే ప్లాంట్లు మూసివేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. ల్యాబ్ రిపోర్ట్‌లో ఎటువంటి ప్రమాదం లేదు అని నిర్ధారించుకున్న తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. నగర పరిధిలో అటువంటివి ఎన్ని ప్లాంట్లు ఉన్నాయో వెంటనే తనకు నివేదించాలని ఆదేశించారు.

డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):నగరంలో డయేరియా నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని, కాలం తీరిన మంచినీటి పైప్‌లైన్లను మార్చేందుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజా ఆరోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో కలుషిత మంచినీటిని తాగి 23 మందికి పైగా అస్వస్థతకు గురై ఒకరు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మంచినీటి పైపులైన్ల మరమ్మతులు సకాలంలో చేయకపోవడంతోనే మురుగు నీరు కలిసి రక్షిత మంచినీరు కలుషితం కావడంతో నగరంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. గతంలో మొగల్రాజపురంలో కూడా ఇదే తరహాలో డయేరియా కేసులు నమోదయ్యాయని, అప్పుడు ఇద్దరు మృతి చెందడం జరిగిందన్నారు. విజయవాడ రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఉండి జాతీయ స్థాయి స్వచ్ఛభారత్ అవార్డులు పొందుతున్నప్పటికీ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించడంలో నగరపాలక సంస్థ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. డయేరియాతో ఆసుపత్రి పాలైన రోగులందరికీ అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు నగరంలో డయేరియా కేసులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలం తీరిపోయిన పైపులన్నింటినీ మార్చి కొత్త పైప్‌లైన్ వేయాలని, నగర వ్యాప్తంగా అందుకు అవసరమైన తనిఖీలను వెంటనే చేపట్టాలని కోరారు. అతిసారను నివారించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఆర్వో ఫిల్టర్లు ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థితిగతులు లేనందున రక్షిత మంచి నీటిని వీఎంసీ అత్యంత బాధ్యతాయుతంగా సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టండి

సీఈకి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ వినతి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ మౌష్మి గనియా

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ వెదజల్లుతున్న కాలుష్యం నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆ సంస్థ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులుని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు కోరారు. ఎన్టీటీపీఎస్ పరిపాలనా భవనంలో సీఈని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటి వాటి రక్షణ బాధ్యత చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్లాంట్ వలన మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కొండపల్లి కమిషనర్ మౌష్మి గనియా పాల్గొన్నారు.

బూడిద లోడింగ్‌కు అవకాశం ఇవ్వకుంటే అడ్డుకుంటాం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చెరువులో బూడిద లోడింగ్‌ను స్థానికులకు ఇవ్వకుంటే అడ్డుకుంటామని వార్డు కౌన్సిలర్ రావి ఫణి, లారీ ఓనర్లు ఏపీ జెన్‌కో అధికారులను హెచ్చరించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా బూడిద కాలుష్యంతో పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్యంతో ప్రజలకు వ్యాధులు సంక్రమిస్తుంటే లాభాలు ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నో కుటుంబాలు బూడిద రవాణాపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తే తాము ఎలా జీవించాలని ప్రశ్నించారు. పలువురు లారీ ఓనర్లు, వర్కర్లు పాల్గొన్నారు.